సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 25 । జూలై । 2023



అర్జీలకు సంతృప్తికర పరిష్కారం
జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ నిషంత్‌కుమార్ ఆదేశించారు. - 8లో



కుంగిపోయిన కల్వర్టు
వేపాడ మండలం కృష్ణారాయుడుపేట వెళ్లే రహదారిల్లో కోటా బియ్యం తీసుకువెళ్తున్న లారీకి ప్రమాదం తప్పింది. - 8లో



బ్యాంకు చోరీకి విఫల యత్నం
పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల సెంట్రల్ బ్యాంకులో చోరీయత్నం కలకలం రేపింది. - 8లో

న్యూస్‌రీల్

డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో బాలచంద్రుడు ఫస్ట్



బాలచంద్రుడుకు నగదు అవార్డును అందజేస్తున్న రాజన్న దొర, కళావతి(ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: విశాఖపట్నంలో ఈ నెల 22, 23వ తేదీల్లో జరిగిన రాష్ట్ర ఆదివాసీ ఉత్సవాల్లో నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ గ్రామానికి చెందిన మండంగి బాలచంద్రుడు ప్రతిభ చూపాడు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడికర రాజన్నదొర, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చేతుల మీదుగా రూ.10వేల నగదుబహుమతి, జ్ఞాపికను అందుకున్నాడు. విద్యార్థిని డ్రాయింగ్ టీచర్ (లైజన్ ఆఫీసర్) రుగడ శ్రీనివాసరావు అభినందించారు. ఇదే పోటీల్లో దురుబిల్లి గ్రామానికి చెందిన ఆరిక గౌతమ్, కీసర గూడకు చెందిన ఆరిక సన్యాసిరావు కూడా రాణించారు.

ఎంఎల్‌హెచ్‌పీలు అందుబాటులో ఉండాలి



వండవ హెల్త్ క్లినిక్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

వీరఘట్టం/పాలకొండ: వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు స్థానికంగానే నివాసం ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు హెచ్చరించారు. పాలకొండ మండలం కొండాపురం, వీరఘట్టం మండలం వండవ గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సోమవారం తనిఖీ చేశారు. హెల్త్ క్లినిక్‌లకు సరఫరా చేసిన పరికరాలు, మందులు సక్రమంగా వినియోగించాలని సూచించారు. శాశ్వత భవనాలు అందుబాటులో లేని గ్రామాల్లో అద్దె భవనాల్లో క్లినిక్‌లు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో వైద్యసేవలందించాలని సూచించారు. గర్భిణులకు ప్రసవ తేదీలను తెలియజేసి ముందుగానే ఆస్పత్రిలో చేర్పించాలని సూచించారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు

- రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే



గురువునాయుడుపేటలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను పరిశీలిస్తున్న కాంతిలాల్‌దండే

పాచిపెంట/కురుపాం: పాఠశాలల భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా గురువునాయుడుపేటలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాలు, పాచిపెంట గిరిజన సంక్షేమ ఆశ్రమఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులను, సాలూరు మండలం మామిడిపల్లిలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల భవనాలు, కురుపాంలోని శివ్వన్నపేట ఏకలవ్య పాఠశాల, గురుకుల పాఠశాలలను పరిశీలించారు. భవన నిర్మాణాల తీరుపై ఇంజినీరింగ్ శాఖ అధికారులను ప్రశ్నించారు. మూడు నెలల్లో పనులు పూర్తిచేస్తామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఆయన వెంట పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, గిరిజ న సంక్షేమ శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, కార్య నిర్వాహక ఇంజినీర్ జె.శాంతీ శ్వరరావు, జిల్లా గిరిజ న సంక్షేమ, సాధికారిత అధికారి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

'పీఎం యశస్వి'కి దరఖాస్తులు

పార్వతీపురంటౌన్: నేషనల్ టెస్ట్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తున్న పీఎం యశస్వి ఎంట్రన్స్–2023 స్కాలర్‌షిప్ పరీక్షను సెప్టెంబర్ 29న నిర్వహిస్తామని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 9వ తరగతి నుంచి 11వ తరగతి వరకు చదువుతున్న ఓబీసీ, ఈబీసీ విద్యార్థులు ఆగస్టు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకోసం హెచ్‌టీటీపీఎస్://యట్.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

● శాస్త్రీయ సాగు



చిత్రంలో ఉభాలు చేస్తున్నది కొమరాడ మండలంలోని కుంతేస్ గిరిశిఖర గ్రామ రైతులు. వర్షాలు జోరందుకోవడంతో కొండపై నుంచి జాలువారే నీటిని ఒడిసిపట్టి పొలాలకు మళ్లిస్తున్నారు. దమ్ముచేసి తాడుపద్ధతిలో శాస్త్రీయంగా నాట్లు వేస్తున్నారు. రైతుభరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు, అధికారుల సూచనలు పాటిస్తూ.. అధిక దిగుబడి సాధనే లక్ష్యంగా ముందుకు 'సాగు'తున్నారు.
- కొమరాడ

● ఉప్పొంగిన గెడ్డ



భారీ వర్షాలకు మెంటాడ మండలం కె.ఎల్.వలస గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న కూనేటి గెడ్డ ఉప్పొంగింది. నీటి ఉధృతి పెరగడంతో గ్రామానికి సోమవారం రాకపోకలు నిలిచిపోయాయి. తారురోడ్డుపై నుంచి వర్షపునీరు ప్రవహిస్తుండడంతో వివిధ పనులపై గ్రామం నుంచి బయటకు వెళ్లే వారు గెడ్డకు ఆవల ఉండిపోయారు.
- మెంటాడ

● జలకళ



బంగాళాఖాతంలో ఒడిశా తీరంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనంతో పార్వతీపురం మన్యం జిల్లాలో భారీ వర్షం కురుస్తోంది. కొండలపై నుంచి వర్షపునీరు జాలువారుతోంది. సీతంపేట ఏజెన్సీలో పర్యాటక ప్రాంతమైన మెట్టుగూడ జలపాతానికి జలకళ సంతరించుకుంది. నీటి సవ్వడితో పర్యాటకులను ఆకర్షిస్తోంది.
- సీతంపేట

గిరిజన గ్రామాలకు మార్గం సుగమం!

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చొరవతో రూ.కోటి 5లక్షలు మంజూరు
- మాసాలగెడ్డపై చురుగ్గా సాగుతున్న వంతెన నిర్మాణం
- మూడునెలల్లో పూర్తిచేస్తామంటున్న అధికారులు
- వంతెన పూర్తయితే పదిగ్రామాల ప్రజలకు తొలగనున్న దారి కష్టాలు

పాచిపెంట:

చినుకు పడితే చాలు ఆ గిరిజన గ్రామాల ప్రజల్లో గుబులు రేగుతుంది. వర్షపు నీటితో మాసాగెడ్డ పొంగి ప్రవహిస్తుంది. వారు నడిచే మార్గాన్ని బురదతో కప్పేసి రాకపోకలకు ప్రతిబంధకంగా మార్చేస్తుంది. దశాబ్దాలుగా పాచిపెంట మండలంలోని పది గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న నరకయాతనకు కొద్దిరోజుల్లో విముక్తి కలగనుంది. ఈ ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చొరవతో మాసాగెడ్డపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం ఐటీడీఏ నిధులు రూ.కోటి ఐదులక్షలు మంజూరు చేసింది. పనులు ఆరంభం కావడంతో దశాబ్దాల వేదన తీర్చే 'దారి' కలిగిందంటూ గిరిజనులు సంతోషపడుతున్నారు.

ఇదీ పరిస్థితి...
పాచిపెంట మండలంలోని పద్మాపురం, పెద్దవలస పంచాయతీల పరిధిలోని ఈతమానువలస, మూలవలస, మెట్టవలస, వెలగవలస, బందవలస, దండిగుడ్డి తదితర గిరిజన గ్రామాల ప్రజలు పాచిపెంట మండల కేంద్రానికి చేరాలంటే మధ్యలో మాసాలగెడ్డను ఈతమానువలస వద్ద దాటాలి. దానిపై వంతెన లేకపోవడంతో వర్షం కురిస్తే చాలు.. కొండలపై నుంచి వచ్చిన వరదనీటితో గెడ్డ ఉగ్రరూపం దాల్చుతుంది. కొండ బురదతో రాకపోకలు సాగించే మార్గాన్ని కప్పేస్తోంది. అత్యవసర వేళ 108 వాహనం చేరే అవకాశం ఉండదు. రోడ్డుపై బురద చేరడంతో కనీసం ద్విచక్రవాహనాలపై వెళ్లేందుకూ అవకాశం లేదు. డోలీలో రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిన దుస్థితి.

రాజన్నదొర చొరవతో...
గిరిజనుల దారి సమస్యను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, గిరిజన నాయకులు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ వంతెన నిర్మాణం చేపట్టి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వెంటనే స్పందించిన రాజన్నదొర వంతెన నిర్మాణానికి రూ.కోటి 5 లక్షల ఐటీడీఏ నిధులను మంజూరు చేయించారు. రాజన్నదొర సూచనల మేరకు ఇంజినీరింగ్ అధికారులు పనులు చురుగ్గా చేపడుతున్నారు. మూడు నెలల్లో వంతెన పనులు పూర్తిచేస్తామని పార్వతీపురం ఐటీడీఏ ఈఎన్‌సీ శ్రీనివాసరావు స్పష్టంచేశారు.

గిరిజనులను మభ్యపెట్టిన టీడీపీ..
గతంలో ఇక్కడ వంతెన నిర్మాణానికి టీడీపీ సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్‌పీ భంజ్‌దేవ్ కొబ్బరికాయ కొట్టారు. అనంతరం వంతెన నిర్మాణాన్ని విస్మరించారు. కనీసం పైసా నిధులు మంజూరుకు కృషిచేయలేదు. ప్రచారాలు చేసేది టీడీపీ అయితే, పనులు చేసేది వైఎస్సార్‌సీపీ అంటూ గిరిజనులు తమదైన శైలిలో వ్యాఖ్యానిస్తున్నారు.



మాసాలగెడ్డపై ఈతమానువలస వద్ద సాగుతున్న వంతెన పనులు



మాసాలగెడ్డ నీరు పోటెత్తడంతో బురదమయంగా మారిన ఈతమానువలస రోడ్డు (ఫైల్)

దీర్ఘకాలిక సమస్య పరిష్కారం



రాజన్నదొర కృషితో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఐటీడీఏ నిధులతో చకచకా సాగుతున్నాయి. వంతెన పనులు పూర్తయితే గిరిజన గ్రామాల ప్రజలకు దారి సమస్య పరిష్కారమవుతుంది. మాసాలగెడ్డ బురద సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. గిరిజనుల తరపున రాజన్నదొరకు ప్రత్యేక ధన్యవాదాలు.
- పాచిపెంట వీరం నాయుడు, పద్మాపురం మాజీ సర్పంచ్

విద్యుదాఘాతంతో గాయపడిన జేఎల్‌ఎం

- సిబ్బంది నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమంటూ బంధువుల ఆందోళన
- విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి.. సరఫరాకు అంతరాయం



విద్యుదాఘాతానికి గురై వైద్యసేవలు పొందుతున్న శ్రీనివాసరావు



కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐలు అనీష్, ఎం.వి.రమణ

వీరఘట్టం:

మండలంలోని కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మన్ గురాన శ్రీనివాసరావు సోమవారం మధ్యాహ్నం విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తోటి జేఎల్‌ఎంలు వెంటనే ఆయనను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంటనే విద్యుత్ శాఖ ఏడీఈ మోహన్ చక్రవర్తి, ఏఈ డి.బాలాజీలు పాలకొండ ఏరియా ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖపట్నం మెడికవర్‌కు తరలించారు. ప్రాణాపాయం తప్పిందని వైద్యులు చెప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ప్రమాదం జరిగిందిలా..
కొట్టుగుమ్మడ, గడగమ్మ ఇన్‌చార్జి జేఎల్‌ఎంగా కొద్దిరోజులుగా శ్రీనివాసరావు పనిచేస్తున్నాడు. వారం రోజుల కిందట వర్షాలకు గడగమ్మ సమీపంలో ఓ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. బిటివాడ విద్యుత్ ఫీడర్‌లో ఉన్న స్తంభానికి విద్యుత్ సరఫరా నిలిపివేసి, వైర్లను అక్కడే పడేశారు. ఈ స్తంభాన్ని సోమవారం నిలబెట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు ముగ్గురు జేఎల్‌ఎంలు వెళ్లారు. వీరిలో చిదిమి వైపు ఒకరు, కిమ్మి వైపు ఒకరు వెళ్లగా గడగమ్మ వైపు శ్రీనివాసరావు వెళ్లాడు. వారంరోజుల కిందట కట్‌చేసిన వైర్లకు విద్యుత్ సరఫరా అవుతుందనే విషయాన్ని గమనించక, వాటిని పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. దీనిని గమనించిన గడగమ్మ గ్రామానికి చెందిన యువకులు వీరఘట్టం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో శ్రీనివాసరావు గాయాలతో బయటపడ్డాడు. సిబ్బంది ఎల్‌సీ ఇవ్వడంలో నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందంటూ బాధితుడి కుటుంబసభ్యులు, కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామస్తులు వీరఘట్టం సబ్‌స్టేషన్ వద్ద మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆందోళన చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. దీంతో మండలంలోని 20 పంచాయతీలకు సుమారు 5 గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

న్యాయం చేస్తాం..
వీరఘట్టం ఎస్‌ఐ ఎం.వి.రమణ, జియ్యయమ్మవలస ఎస్‌ఐ పి.అనీష్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. ఏఈ బాలాజీ, ఏడీఈ మోహన్ చక్రవర్తిని పిలిపించారు. శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, పూర్తిస్థాయిలో వైద్యం చేయిస్తామని వారు హామీ ఇచ్చారు. ప్రమాదంపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని, దర్యాప్తు చేస్తామని తెలపడంతో స్థానికులు ఆందోళన విరమించారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులు అన్ని ఫీడర్లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు.

మడ్డువలసలో గజరాజులు



మడ్డువలస వద్ద సంచరిస్తున్న ఏనుగుల గుంపు

వంగర: గత మూడు రోజులుగా వంగర మండలంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు సోమవా రం మగ్గూరు, సంగాం గ్రామాల సమీప పంట పొలాల్లో తిష్టవేశాయి. మడ్డువలస కళాశాల ఆవరణలోని కళాశాల నేమ్ బోర్డు, ఐరన్ గేటు, తాగునీటి సరఫరా పరికరాలను ధ్వంసం చేశా యి. పార్వతీపురం మన్యం జిల్లా ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ కె.మణికంఠేశ్ ఆధ్వర్యంలో ఎలిఫెంట్ టేకర్స్ ఏనుగుల గుంపు సంచారాన్ని పరిశీలిస్తూ.. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఓటరు సర్వేపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు



స్వచ్ఛసర్వేక్షన్ సర్వే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, జిల్లా అధికారులు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రత్యేక ఓటరు జాబితా పునశ్చరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు నిర్వహించే ఇంటింటి ఓటరు సర్వేలో నిర్లక్ష్యం చేసే బూత్‌స్థాయి అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ హెచ్చరించారు. జిల్లాలో సాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై మండల స్థాయి అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్షించారు. ప్రత్యేక ఓటరు జాబితా పునశ్చరణ, హౌసింగ్, ఉపాధిహామీ పథకం, ప్రాధాన్యత భవనాల నిర్మాణం, భూముల రీసర్వే, గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. మున్సిపాలిటీల పరిధిలోని వైఎస్సార్ జగనన్న కాలనీలకు మౌలిక వసతులు కల్పించి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్ భవనాలను నూరుశాతం పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, డీపీఓ బలివాడ సత్యనారాయణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయగౌరి, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ
స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లాను ముందు వరుసలో నిలపాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పట్టణాలు, నగరాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందించేందుకు స్వచ్ఛసర్వేక్షణ సర్వే దోహదపడుతుందన్నారు.

29న హైకోర్టు చీఫ్ జస్టిస్ రాక

విజయనగరం లీగల్: రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి రెండు రోజుల పర్యటన నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రంలో ఈ నెల 29న జరగనున్న సెమినార్‌లో పాల్గొంటారు. 30న జిల్లా కోర్టు ప్రాంగణంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తారు.

నేడు మంత్రి అమర్నాథ్ రాక

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్నాథ్ జిల్లాకు మంగళవారం రానున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఉదయం జరిగే సాలూరు నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొంటారన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సిన పార్వతీపురం నియోజకవర్గ స్థాయి సమావేశం అనివార్య కారణాలవల్ల వాయిదా పడిందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించాలని కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి



రైతు ఉత్పత్తిదారుల సేవా కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వీరఘట్టం మండలం యు.వెంకమ్మపేట వద్ద రూ.15 లక్షల వ్యయంతో ఇటీవల నిర్మించిన రైతు ఉత్పత్తిదారుల సేవా కేంద్రం, శీతల గిడ్డంగిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు సాగుచేసే రైతులు తాము పండించిన సాధారణ పంటలతో పాటు ఉద్యానవన పంటలను నిల్వచేసుకోవచ్చన్నారు. మద్దతు ధర వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చని చెప్పారు. భవిష్యత్తులో ఇది గొప్ప కలెక్షన్ సెంటర్‌గా మారేందుకు అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ పి.కిరణ్‌కుమార్, జిల్లా ఉద్యానవన శాఖ ఏడీ సత్యనారాయణరెడ్డి, పాలకొండ డివిజనల్ అధికారి అమరేశ్వరి, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైస్ ఎంపీపీ పర్రి విజయకుమారి, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, సొంట్యాన సింహాచలం పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్లాక్‌బెల్ట్ టెస్ట్‌లో 8 మందికి అర్హత



బ్లాక్‌బెల్ట్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారితో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో 8 మంది క్రీడాకారులు అర్హత సాధించారు. నగరంలో నిర్వహించిన టెస్ట్‌లో పి.పునీత్, వి.కుశాల్, కె.సాహిత్య, సంకీర్తన, ఎస్.సాత్విక్, ముఖేష్, రిషి, లిఖిత్ ఫస్ట్ డాన్ బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారిలో ఉన్నారు.వీరికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

హిందీ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి ఆదర్శపాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వి.రామానందసాగర్‌పై సస్పెన్షన్ విధిస్తూ డీఈఓ లింగేశ్వరరెడ్డి సోమవారం ఉత్తర్వులు పంపారని వైస్ ప్రిన్సిపాల్ జి.వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంతకాలంగా తమను పలురకాలుగా వేధిస్తున్నారని పాఠశాలలోని కొంతమంది విద్యార్థులు నేరుగా డీఈఓకు ఫిర్యాదు చేయడంతో ఈనెల 1వ తేదీన డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు పాఠశాలకు విచారణ వచ్చి విద్యార్థులతో మాట్లాడి వారి వివరణ తీసుకున్నారన్నారు. వాస్తవాలను గ్రహించి సస్పెన్షన్ ఉత్తర్వులు పాఠశాలకు పంపించారని తెలిపారు.

వార్డు శానిటరీ కార్యదర్శి..

పాలకొండ: పట్టణంలోని బాసూరు వీధి సచివాలయం వార్డు శానిటరీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌పై కలెక్టర్ నిషాంత్ కుమార్ సస్పెన్షన్ విధించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హేమంత్ కుమార్‌ను బీఎల్‌వోగా స్థానిక బాసూరు వారి వీధి సచివాలయంలో నియమంచగా 10 రోజులుగా ఆయన ఆర్డర్ తీసుకోలేదు. దీనిపై తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ స్పందించలేదు. దీంతో కలెక్టర్‌కు తహసీల్దార్ ఫిర్యాదు చేయగా సస్పెన్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కుంగిపోయిన కల్వర్టు



రైవాడ కాలువ కల్వర్టులో కూరుకుపోయిన లారీ

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట వెళ్లే రహదారిలో రైవాడ కాలువ గట్టువద్ద కోటా బియ్యం తీసుకువెళ్తున్న లారీకి త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస గౌడౌన్ నుంచి కృష్ణారాయుడుపేట రేషన్ డిపోకు బియ్యాన్ని లారీతో తరలిస్తుండగా గ్రామం సమీపంలో రైవాడ కాలువ కల్వర్టు కుంగిపోయింది. దీంతో లారీ వెనుక టైర్లు కల్వర్టులో కూరుకుపోయియి. డ్రైవర్ చాకచక్యంతో లారీని నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల పునరుద్ధరణ



డిపో మేనేజర్ కనకదుర్గ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం నుంచి ఒడిశా రాష్ట్రానికి నడుస్తున్న బస్సు సర్వీసులను పునరుద్ధరించినట్లు డిపో మేనేజర్ కనకదుర్గ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి జేకేపూర్, నారాయణపట్టణం అంతర్‌రాష్ట్ర సర్వీసులు ఒడిశా రాష్ట్రంలోకి ప్రవేశించడానికి కావాల్సిన పర్మిట్ కాలపరిమితి జూలై 1తో ముగియడంతో ఈ రెండు సర్వీసులు నిలిపివేసినట్లు చెప్పారు. ఈనెల 22న పర్మిట్ రావడంతో ఈ రెండు సర్వీసులను పునరుద్ధరించామని తెలిపారు. జేకేపూర్ సర్వీసు పాత టైం ప్రకారం నడుస్తుందని, నారాయణపట్నం సర్వీసుకు అదనంగా ఒక ట్రిప్పు పెంచామని వివరించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,160-00
బంగారం(22సి. 10గ్రా.)	55,150-00
వెండి (కిలో)	80,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దీపిక

- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులు పరిష్కరించిన తీరుపై ఆయా అర్జీదారులు సంతృప్తి చెందకపోతే ఆయా వినతులను మళ్లీ పరిశీలించి సంతృప్తికర రీతిలో పరిష్కారానికి చర్యలు చేట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో పాటు స్పందనకు కొన్ని సమస్యలపై పదేపదే వస్తున్న వినతుల పరిష్కారానికి అధికారులు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. గతవారంలో అసంతృప్తి వ్యక్తమైన వినతుల పరిష్కారంపై సోమవారం జిల్లా అధికారులతో ఆమె సమీక్షించారు. పశుసంవర్ధక, గృహనిర్మాణం, విద్యుత్, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు తదితర శాఖలకు సంబంధించి 96 వినతుల పరిష్కారంపై అర్జీదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమైందని పేర్కొన్నారు. మినీ గోకులం బిల్లులకు సంబంధించి డ్వామా, పశుసంవర్ధక అధికారులు సంయుక్తంగా సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలకు ఎమ్మెల్యే వినతి

రాజకీయ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న రామభద్రపురం మండలం కొండకెంగువ గ్రామం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కంచుపల్లి కోటేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ నాగలక్ష్మికి బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడు వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌ను కలిసి సమస్య వివరించారు. ఉపాధి హామీ పథకం విధుల నిర్వహణలో శ్రద్ధ చూపకుండా నియోజకవర్గం తెలుగుదేశం నాయకుడు బేబీనాయనతో కలిసి రాజకీయ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. అందుకు సంబంధించిన సాక్ష్యాధారాల ఫొటోలను వినతిపత్రంతో జతచేసి ఇచ్చారు. దీనికి కలెక్టర్ నాగలక్ష్మి స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

గ్రీవెన్స్‌కు 223 వినతులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 223 వినతులు అందాయి. కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డీఓ ఎంవీసూర్యకళ, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ, సుదర్శన దొర, పద్మలత తదితరులు వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

విజయనగరం క్రైమ్: ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం చేయాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె 43 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం చేయాలని అధికారులకు వీడియోకాన్ఫరెన్స్‌లో సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్, ఎస్బీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, జి.రాంబాబు, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సంతృప్తికర పరిష్కారం



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

- కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యలను తెలియజేసే అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావుతో కలిసి ప్రజల నుంచి 106 అర్జీలు స్వీకరించారు. సామాజిక, వ్యక్తిగత సమస్యలపై అర్జీలు అందజేసిన ప్రజలతో అధికారులు నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని, ఆ పరిష్కారం అర్జీదారు సంతృప్తిచెందే విధంగా ఉండాలని, సమస్యల పరిష్కారంలో నాణ్యత ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాథరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ దేవ్ముళ నాయక్, జిల్లా సప్లయిస్ అధికారి సూర్యారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి గయాజుద్దీన్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యల పరిష్కారం

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు. పోలీసు అధికారులు వారి పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధిత నివేదికలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్, ఎస్‌బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ ప్రభాకర్, ఏఆర్ ఆర్‌ఐ శ్రీరాములు, డీసీఆర్‌బీ ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు చోరీకి విఫల యత్నం

- గ్యాస్‌కట్టర్‌తో సెంట్రల్ బ్యాంక్ కిటికీ తొలగింపు
- లాకర్ తెరిచేందుకు విఫలయత్నం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



బ్యాంక్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్





చోరీకి ఉపయోగించిన గ్యాస్ సిలిండర్, కట్టర్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల సెంట్రల్ బ్యాంకులో చోరీయత్నం కలకలం రేపింది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి పక్కనే ఉన్న బ్యాంకులో ఈ ఘటన జరగడం చర్చనీయాంశమైంది. సెంట్రల్ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ సోమవారం ఉదయం 9.30 గంటలకు బ్యాంకుకు చేరుకుని షట్టర్ ఓపెన్ చేసి బ్యాంకు లోపలికి వెళ్లారు. బ్యాంకులో ఉన్న కిటికీ తెరిచి ఉండడంతో ఆయన హుటాహుటిన పార్వతీపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై దినకర్ వచ్చి ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సమాచారం అందజేశారు. ఈ మేరకు ఎస్పీ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు గ్యాస్ కట్టర్ల సహాయంతో బ్యాంకు కిటికీలను తొలగించి లోపలికి చొరబడ్డారు. గ్యాస్‌కట్టర్ల సహాయంతో బ్యాంక్ లాకర్‌ను పగలగొట్టడానికి ప్రయత్నించినప్పటికీ తెరుచుకోకపోవడంతో చేసేది లేక వెనుదిరిగారు. బ్యాంకులో వస్తువులు, నగదు అపహరణకు గురికాలేదని, ఎటువంటి చోరీ జరగలేదని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. చోరీకి యత్నించిన నిందితులను పట్టుకుంటామని స్పష్టం చేశారు. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఎటువంటి సొత్తు అపహరణకు గురికాలేదన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకేచోట తల్లీకొడుకుల అంత్యక్రియలు



తల్లీకుమారుల మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకువెళ్తున్న స్థానికులు

రాజాం సిటీ: స్థానిక మెంటిపేట ఎస్సీకాలనీకి చెందిన తల్లీ కొడుకులు కురమమ్మ, అమర్‌ల మృతదేహాలకు కుటుంబీకులు, స్థానికులు ఒకేచోట సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.వ ఈ నెల 23న పలాస ఆర్టీసీ డిపో వద్ద గుండెపోటుకు గురైన కండక్టర్ కురమమ్మ మృతిచెందగా సాయంత్రానికి ఆమె మృతదేహం రాజాం తీసుకువచ్చారు. ఏలూరులో ఫాదర్ శిక్షణ పొందుతున్న ఆమె కుమారుడు అమర్ తల్లి మృతిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆయన మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు అక్కడికి వెళ్లి సోమవారం సాయంత్రానికి రాజాం తీసుకువచ్చారు. దీంతో ఇద్దరి మృతదేహాలను చూసిన కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఆర్‌సీఎం చర్చి వద్ద ప్రార్థనల అనంతరం మృతదేహాలను ఖననం చేశారు.

డ్రైవర్ హత్య కేసులో రెండో ప్రధాన నిందితుడి అరెస్టు



సమావేశంలో మట్లాడుతున్న గజపతినగరం సర్కిల్ సీఐ అప్పలనాయుడు

బొండపల్లి: ఈనెల 13 వతేదీన గొట్లాం వద్ద లారీ డ్రైవర్‌ను హత్య చేసి రైలు పట్టాలపై పడవేసిన కేసులో రెండో ప్రధాన నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లెంక అప్పలనాయుడు తెలిపారు. సాలూరు పట్టణానికి చెందిన అర్బిపల్లి ధనుంజయ నాయుడుతో పాటు మరి కొంతమంది లారీతో వస్తున్న డ్రైవర్ జగదీష్ యాదవ్‌ను ఆపి ప్రయాణికుల ముసుగులో ఎక్కి హత్య చేసి రైలు పట్టాలపై శవాన్ని పడవేసినట్లు తెలిపారు. ఈ హత్య కేసులో రెండో ప్రధాన సూత్రధారిగా ధనుంజయ్ నాయుడు ఉన్నాడని చెప్పారు.

భార్య పట్టించుకోలేదని భర్త ఆత్మహత్య

బాడంగి: భార్య తనపై కినుక వహించి చెప్పా పెట్టకుండా కూలిపనికోసం హైదరాబాద్ వెళ్లిపోయి తిరిగి కన్నవారింటికి వచ్చినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడాన్ని అవమానంగా భరించిన భర్త పురుగుమందుతాగి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలంలోని ముగడ గ్రామానికి చెందిన గిరుడబిల్లి గంగరాజు(34)కు అదేమండలం గొల్లాదిగ్రామానికి చెందిన గంగతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు.భార్య రెండు నెలల క్రితం కూలిపనికోసం హైదరాబాద్ వెళ్లింది. ఆమె కన్నవారింట్లో ఆదివారాల పండగలు జరుగుతున్నాయని శనివారం వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న గంగరాజు పిల్లలతో కలిసి వెళ్లి తల్లి దగ్గరకు వెళ్లమని కామన్నవలసలో వదిలిపెట్టాడు. అనంతరం గొల్లాది గ్రామ పొలిమేరల్లో గడ్డిమందు తాగేసి సైకిల్‌పై అత్తవారింటికి వెళ్లగా అక్కడ వాంతులయ్యాయి. భార్యనిలదీయగా పురుగు మందు తాగానని చెప్పి సీసా చూపించాడు. దీంతో భార్య, బంధువులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం విజయనగరం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై ఆర్.జయంతి కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. ఇదిలాఉండగా మృతుడు గంగరాజు తల్లి పార్వతి తనకొడుకును అత్తవారు వేధించడంతో ఆత్మహత్యకుపాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో నిజానిజాలు బయటపడతాయని ఆదిశగా దర్యాప్తుకొనసాగుతుందని ఎస్సై చెప్పారు.

భార్యపై అనుమానంతో భర్త దాడి

పార్వతీపురం: అనుమానంతో భార్యపై ఓ భర్త వేడినీరు పోసి దాడికి పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలోని పైడివీధికి చెందిన తాడంగి ప్రసాద్, దమయంతి దంపతులు టిఫిన్ షాపు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. భార్యపై అనుమానంతో భర్త ప్రసాద్ చీటికీమాటికి ఆమెతో గొడవ పడుతూ ఉండేవాడు. సోమవారం టిఫిన్ కోసం వచ్చిన యువకుడికి ఆమె పార్సిల్ కడుతుండగా అనుమానంతో వేడినీరు ముఖంపై విసిరికొట్టాడు. దీంతో నుదురు, ముఖంపై గాయాలయ్యాయి. అలాగే వారి కుమార్తె పవిత్రపై కూడా వేడినీరు పడడంతో పలు చోట్ల బొబ్బలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి పుట్టింటివారు వచ్చి చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి ఆమెను తరలించారు.

రాజీకి రాలేదని..



పార్వతీపురం: చికిత్స పొందుతున్న అశోక్

గరుగుబిల్లి మండలం దత్తివలసకు చెందిన బొమ్మాళి అశోక్ తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అశోక్‌కు గ్రామానికి చెందిన కారు సత్యారావు తదితరుల మధ్య కోర్టులో ఉన్న గొడవపై రాజీకి రావడం లేదని విసుగు చెంది ఆదివారం రాత్రి ఇంటి దగ్గర ఉన్న అశోక్‌పై కాంతారావు, తాత బాబు తదితరులు దాడిచేశారు. ఈ దాడిలో అశోక్‌కు పలు చోట్ల గాయాలవడంతో చికిత్సకోసం 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు.

కంటి అద్దాలు మార్చలేదని..



చికిత్సపొందుతున్న చంద్రమౌళి

మూడురోజుల క్రితం తీసుకున్న కంటి అద్దాలు మార్చలేదని షాపు యజమానిపై ఇద్దరు యువకులు దాడిచేసి గాయపరిచారు. పట్టణంలోని మజ్జిగౌరి బీసీఎం బ్యాగ్స్ అండ్ లెదర్ నావెల్టీస్ యజమాని బి.చంద్రమౌళి వద్ద మూడు రోజుల క్రితం ఇద్దరు యువకులు కళ్లద్దాలు తీసుకున్నారు. అవి మార్చమని సోమవారం వచ్చారు. కండ్ల కలక ఉన్న తరుణంలో వాడిన కంటి అద్దాలను మార్చడం కుదరదని యజమాని చెప్పడంతో యువకులు దుర్భాషలాడి చంద్రమౌళిపై స్టీల్ రాడ్‌తో దాడి చేశారు. దీంతో గాయాలపాలైన చంద్రమౌళి చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేరాడు.

శ్లాబ్ సెంట్రింగ్ విషయంలో..



చికిత్స పొందుతున్న గణపతి



చికిత్స పొందుతున్న శంకరరావు

పార్వతీపురం మండలం వెంకంపేటకు చెందిన ఎం. గణపతిరావు, నర్సిపురంలో స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి సంబంధించి శ్లాబ్ సెంట్రింగ్ చేసేందుకు హైస్కూల్ చైర్మన్ ఎం. శంకరరావుతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే సెంట్రింగ్ చేసిన తరువాత సకాలంలో శ్లాబ్ వేయకపోవడంతో డబ్బులు అదనంగా చెల్లించాలని గణపతిరావు, చైర్మన్ శంకరరావును అడిగారు. దీనిపై పాత ఒప్పందం ప్రకారం సెంట్రింగ్ వేయాలని చైర్మన్ స్పష్టం చేయడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగి గొడవకు దిగారు. ఈ గొడవలో ఒకరిపై దాడికి పాల్పడడంతో ఇద్దరికీ పలుచోట్ల గాయాలయ్యాయి.

మా డబ్బులు మాకు ఇప్పించండి

- మహిళల అవేదన



డిపాజిట్ చేసిన నగదును ఇప్పించాలని కోరుతున్న మహిళలు

గుర్ల: మోసపూరిత కంపెనీలో డబ్బులు డిపాజిట్ చేసి మోసపోయామని తమ డబ్బులు తమకు ఇప్పించాలని మండలంలోని శేషపుపేట మహిళలు వేడుకుంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన 39 మంది మహిళలు డిపాజిట్లు చేసిన రశీదులతో సోమవారం గుర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేఎంజీ ల్యాండ్ డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, లోహిత్ భారత్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరు మీద పదేళ్ల కిందట మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన ఒక ఏజెంట్ డిపాజిట్లు సేకరించినట్లు వారు తెలిపారు. డిపాజిట్ల గడువు పూర్తయినందున నగదు చెల్లించాలని ఏజెంట్ వద్దకు వెళ్తే కంపెనీ మూసివేశారని చెబుతున్నాడని వాపోయారు. తమ డబ్బులు తమకు ఇప్పించాలని మహిళలు సువ్వాడ చిన్నమ్ములు. బోడశింగి సత్యవతి, చందక పైడిరాజు, దొంతల శ్రీరాములు కోరుతున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో పడి ఉన్న గోవిందరావు

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని గుంకలాం గ్రామానికి చెందిన లెంక గోవింద రావు (45) టీవీఎస్ బైక్‌తో ఇంటి నుంచి పొలంలోకి వెళ్తూ గ్రామ పరిధిలో జాతీయ రహదారిని దాటుతుండగా గొట్లాం రోడ్డు నుంచి మితిమీరిన వేగంతో వచ్చిన కారు బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో గోవిందరావు తలకు తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు, కుటుంబసభ్యుల సహాయంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే గోవిందరావు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య కుమారి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై గణేష్ తెలిపారు.

నేడు మినీ జాబ్ మేళా

చీపురుపల్లి: నిరుద్యోగ యువత కోసం ఏపీ స్కిల్ హబ్, ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల జేకేసీ కేంద్రం సంయుక్తంగా మంగళవారం చీపురుపల్లిలో నిర్వహించే మినీజాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పివి.కృష్ణాజీ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు హెటిరో డ్రగ్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ పరిశ్రమలు హాజరై నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. హెటిరో డ్రగ్స్ పరిశ్రమలో 80 ఖాళీలకు గాను బీఎస్సీ, బీకాం, ఎంఎస్సీ, బీఏ, ఐటీఐ విద్యార్హత కలిగిన యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అలాగే డెక్కన్ ఫైన్ కెమికల్స్ పరిశ్రమలో ఉన్న 120 ఖాళీలకు గాను బీఎస్సీ కెమిస్ట్రీ, సీబీజెడ్ గ్రూపులతో పాటు ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలైటికల్ కెమిస్ట్రీ విద్యార్హత కలిగిన యువత హాజరుకావాలని సూచించారు. ఈ రెండు పరిశ్రమల్లో ఉద్యోగావకాశాల కోసం 18 సంవత్సరాల నుంచి 27 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగిన యువకులు అర్హులని తెలిపారు.

260 లీటర్ల సారా స్వాధీనం



పాలకొండ రూరల్: ఘటనా స్థలంలో నిందితులు వదిలి వెళ్లిన ద్విచక్రవాహనం, సారా



జియ్యమ్మవలస: సారా ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు -ఓని గ్రామాల మీదుగా ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న 260 లీటర్ల సారాను పాలకొండ ఎస్సై బి.శివప్రసాద్‌తో కూడిన ప్రత్యేక పోలీసు బృందం స్వాధీనం చేసుకుంది. సోమవారం వేకువజామున ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి పోలీసుల కదలికలను పరిశీలిస్తూ రావడం, ఆ వ్యక్తి సూచనలతో మరో ముగ్గురు మూడు ద్విచక్రవాహనాలపై నల్లని మూటల్లో ప్రత్యేక క్యాన్లలో సారాను తీసుకురావడంపై అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పోలీసులను గమనించిన నిందితులు పారిపోవడంతో సారా నిల్వలు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదుచేశారు. త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటామని ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

సారా ధ్వంసం

జియ్యమ్మవలస: జియ్యమ్మవలస, చినమేరంగి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఇటీవల పట్టుబడిన సారాను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సోమవారం ధ్వంసం చేశారు. జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన 200 లీటర్ల సారా, 26 లీటర్ల మద్యం, చినమేరంగి పోలీస్‌స్టేష పరిధిలో పట్టుబడిన 1956 లీటర్ల సారా, 25 లీటర్ల మద్యం ధ్వంసం చేశారు. కార్యక్రమంలో చినమేరంగి ఎస్సై కళాధర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సారా కేన్లతో వ్యక్తి అరెస్ట్

జియ్యమ్మవలస మండలంలోని రావాడ పరిసర ప్రాంతాలలో 8 కేన్లతో సారా తరలిస్తుండగా నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్సై కళాధర్ తెలిపారు. సారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఓ నిందితుడు దొంగచాటుగా సారా తరలిస్తుండగా పట్టుకుని కేసునమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సీతంపేటలో 173 లీటర్ల సారా..

సీతంపేట: కొద్ది రోజుల కిందట దాడుల్లో పట్టుబడిన 173.5 లీటర్ల సారాను పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు సమక్షంలో సోమవారం ధ్వంసం చేశారు. 13 కేసులలో ఈ సారాను పట్టుకున్నట్లు సీతంపేట ఎస్సై నీలకంఠరావు తెలిపారు.

1500 సారా ప్యాకెట్ల స్వాధీనం

పాచిపెంట: అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తి నుంచి 1500 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఫకృద్దీన్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఎడ్ల సన్యాసి సోమవారం తన ద్విచక్ర వాహనంతో ఒడిశా నుంచి పాచిపెంట వైపు 1500 సారా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నామని, నిందితుడి నుంచి సారా ప్యాకెట్లతో సహా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.